క్లుప్తంగా

తాగునీటి బావి పరిశుభ్రం

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామంలో ప్రజలకు సురక్షిత నీటిని అందించే క్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిర్లంగి ఉపేంద్రకుమార్ ఇన్ ఫిల్టర్ తాగునీటి బావిని శుభ్రం చేయించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి వనరుల పునరుద్ధరణపై సంబంధిత అధికారులు సమన్వయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం అక్కడి బావుల్లో పూడిక తీతలతో పాటు క్లోరినేషన్ చేయించారు. త్వరలో రక్షిత పథకం ద్వారా తాగునీరు అందించేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు.

అకాల వర్షంతో పంటలకు నష్టం



గుణానపురంలో కూలిన అరటి చెట్లు

కొమరాడ: మండలంలో మంగళవారం కురిసిన అకాలవర్షంతో పంటలకు నష్టం వాటిల్లాయి. సాయంత్రం ఉన్నట్టుండి పడిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుణానపురం, కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాల్లోని అరటి, మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. చేతికి అందివచ్చిన పంట పోవడంతో బాధిత రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్పందించి, నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సమస్యల వేదిక రేపు



పాలకొండ: నగర పంచాయతీలో ఈ నెల 17న ప్రజా సమస్యల వేదిక ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ జయరాం తెలిపారు. ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రజా వేదికలో ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు అందించాలని సూచించారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు నగర పంచాయతీ కార్యాలయంలో తమ సమస్యలు వివరించి పరిష్కరించుకోవాలని కోరారు.

అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలు, బ్యానర్లను ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణా చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు, స్కౌట్ అండ్ గైడ్స్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా



నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కురుపాం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తక్షణమే ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని, పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుగుబిల్లి సూరయ్య, సమితి సభ్యులు మండంగి సింగన్న, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

–గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

● మున్సిపల్ కార్మికుల ధర్నా



పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిటైర్ అవుతున్న వారికి రూ.75వేలు అందించాలని, వారి పిల్లలకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పడాల వేణు, విమల, శ్రీదేవి, రఘు, సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ

● పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు పి.తవిటినాయుడు కోరారు. మండలంలోని రావుపల్లిలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల అడ్మిషన్(ప్రవేశం)కు సంబంధించి, మంగళవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పాఠశాలలో చేరేందుకు ఒప్పుకున్న చిన్నారులకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి.జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

–గరుగుబిల్లి

● 'మత్తు'తో జీవితం చిత్తు



మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం కోరారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎస్‌ఎస్‌ఎస్ పీవో రామయ్యగారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులంతా గంజాయి, మద్యానికి బానిసలై తమ జీవితాలు పాడు చేసుకుంటున్నారని ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, సన్మార్గంలో నడవాలని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

–గుమ్మలక్ష్మీపురం

ప్రజాసమస్యల పరిష్కారంపై ▸ దృష్టి సారించండి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శెట్టి శ్యామల



ప్రగతి నివేదిక వెల్లడిస్తున్న ఏవో శంకరరావు

కొమరాడ: ప్రజాప్రతినిధులు, అధికారులంతా కలిసి ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని ఎంపీఈప శెట్టి శ్యామల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమె.. గిరిశిఖర గ్రామాల్లోని తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కొంతమంది అధికారులు పక్షపాతి ధోరణి అవలంబిస్తున్నారని, అటువంటి వారు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో ప్రజల అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు వేయాలన్నారు. గంగరేగువలస సర్పంచ్ కోడి తిరుపతిరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఏం జరుగుతుందో కనీసం సర్పంచ్‌లకు కూడా తెలియకుండా తమ ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దళాయిపేట ఎంపీటీసీ ఎం.సురేష్ మాట్లాడుతూ అధికారులు కూటమి నాయకులతో కుమ్మక్కై గౌరవ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకుండా తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని విరుచుకుపడ్డారు. పథకాలను కూటమి నాయకులకు తప్ప అర్హులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, అర్హులకే సంక్షేమ ఫలాలు చేరేలా చూడాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ కేంద్రక అన్నపూర్ణ, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఏవో శంకరరావు, ఏపీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



దగ్ధమైన గడ్డివాము

భామిని: మండలంలోని గురండి కాలనీలో విద్యుత్ నిప్పులు తుళ్లి గడ్డివాము దగ్ధమైంది. ఏబీ రోడ్డు పక్కనే గురండికి చెందిన రైతు సివ్వల గోవిందరావు గడ్డివాము వేసి దుక్కి పశువులు, పాడి పశువులు పెంచుకుంటున్నాడు. ఈదురు గాలులు వీస్తున్న తరుణంలో లూజుగా ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం సంభవించిందని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏ ట్రాఫిక్ సిగ్నల్‌కు ఏ విధంగా ముందుకు కదలాలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులు వివరించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలకు లోబడి ఉండాలని, అలాంటప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఎస్‌ఐ పి.నారాయణరావు తెలిపారు. అతివేగం, పరిమితికి మించిన లోడు, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు.

ఘనంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం



స్వామివారి పట్టాభిషేకం చేస్తున్న పురోహితులు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా వారం రోజులుగా ఆలయంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగమ శాస్త్ర పండితులు సూరిబాబు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. చివరి రోజు స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేకం, పుష్పాభిషేకంతో ఉత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా పట్టాభిషేక విశిష్టతను పురోహితులు వివరించారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు.

సొంత నిధులతో ఇసుక మేటల తొలగింపు



డ్యామ్ ట్యూబ్‌ను శుభ్రం చేస్తున్న విక్రంపురం గ్రామస్తులు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం సమీపంలో ఉన్న జంఝావతి రబ్బర్ డ్యామ్ లోలెవల్ కెనాల్ ట్యూబ్‌ను మంగళవారం శుభ్రం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళింగ మల్లేశ్వరరావు తన సొంత నిధులతో కూలీలను తీసుకువెళ్లి, ట్యూబ్ దగ్గరి ఇసుక మేటలను తొలగించే పనులు చేయించారు.

రైతులకు అవసరమయ్యే ప్రాజెక్టుల నిర్వహణ, అభివృద్ధికి కూడా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమని ఆయన అన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు రైతుల పంటపొలాలకు సాగునీరు సక్రమంగా వెళ్లేలా విక్రంపురం గ్రామస్తులతో నీటి సరఫరాకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారం, ఇసుకమేటలు తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా రత్నంరాజు

పాలకొండ: నగర పంచాయతీ కమిషనర్‌గా రత్నంరాజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ జయరాం కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జరిగిన మున్సిపల్ కమిషనర్‌ల బదిలీల్లో విజయనగరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న రత్నంరాజును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విధుల్లో చేరనున్నారు.

అవగాహనతో ప్రమాదాలకు చెక్

వీరఘట్టం: ప్రస్తుత వేసవిలో అనుకోకుండా సంభవించే అగ్ని ప్రమాదాలకు వగాహనతో చెక్ పెట్టవచ్చని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ప్రత్యేక డెమో చేపట్టారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటే శాఖాపరంగా వాటిని ఎలా అధిగమిస్తారో చేసి చూపించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన సూచనలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు.

అటవీ జంతువులకు హాని చేయొద్దు..



బిల్లుమడలో సిబ్బందితో మాట్లాడుతున్న అటవీ రేంజ్ అధికారి రామారావు

భామిని: వేసవిలో వివిధ కారణాలతో జనావాసాల్లోకి వచ్చే అటవీ జంతువులకు ఎటువంటి హాని కలగజేయొద్దని పాలకొండ అటవీ రేంజ్ అధికారి కె.రామారావు సూచించారు. అటవీ జంతువుల సంరక్షణకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయన మండలంలోని బిల్లుమడ అటవీ పరిసర ప్రాంతంలో మంగళవారం తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జీవాల దాహార్తిని తీర్చే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఏనుగు సంచారం కొనసాగుతున్న క్రమంలో ప్రజలు వాటిని కవ్వించకుండా అప్రమత్తంగా ఉండాలని, తమ సిబ్బందికి తగిన సమయంలో సమాచారం ఇవ్వాలని సూచించారు. కేర్ ట్రాకర్స్ క్షేత్ర స్థాయిలో అంకితభావంతో విధులు చేపట్టాలన్నారు.

వర్షంతో ఉపశమనం



పాలకొండ రూరల్: పట్టణంలో కురుస్తున్న వర్షం



సీతంపేట: హడ్డుబంగిలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న పాలకొండ వాసులకు మంగళవారం కురిసిన ఓ మోస్తరు వర్షం అన్ని వర్గాల వారికి ఊరటనిచ్చింది. ముఖ్యంగా మామిడి రైతులకు ఈ వర్షం మేలు చేకూర్చనుంది. గాలులు లేకుండా వర్షం కురవటంతో కాయ తొడిమి గట్టిపడేందుకు ఈ తడులు సహకరిస్తాయని రైతులు పేర్కొంటున్నారు. మరోవైపు తేలికపాటి వర్షం కావటంతో వేసవి దుక్కులకు సిద్ధమవుతున్న రైతులకు కొంత మేర ఈ తడులు తోడ్పాటు అందిస్తుంది. ఏదిఏమైనా ప్రస్తుత వేసవితో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటుతున్న క్రమంలో ఈ తరహా వర్షాలతో ఉపశమనం లభిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

వర్షంతో ఊరట

సీతంపేట: మండలంలో పలు చోట్ల మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు కాస్తా ఉపశమనం కలిగింది. జీడి, మామిడి పంటలకు కొంతమేర నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని, గ్రామసభల్లో గ్రామ ప్రగతికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని నాగూరు సర్పంచ్ కేతిరెడ్డి శిరీష అన్నారు. మండలంలోని నాగూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభకు హాజరైన ఆమె.. గ్రామస్తులతో కలిసి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య శాల స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి, గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి, పేదల ఇళ్లస్థలాలకు సంబంధించి స్థలం గుర్తింపు వంటి అంశాలపై తీర్మానం చేశారు. ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ గ్రామసభలో గుర్తించిన పనుల ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీడీవో, సర్పంచ్‌లు కోరారు. సభలో ఎంపీటీసీ ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సీతంపేట రహదారిలో వాహన తనిఖీల్లో నిమగ్నమైన పోలీసులు

పాలకొండ రూరల్: వాహనాలు నడిపే చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు చేపడతామని ఏఎస్‌ఐ ఝాన్సీ అన్నారు. పాలకొండ - వీరఘట్టం, సీతంపేట రహదారుల్లో మంగళవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా ఒడిశా నుంచి నియోజకవర్గంలోకి వచ్చే మార్గాల్లో ఈ తనిఖీలు చేపట్టడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మద్యం, గుట్కా వంటి నిషేధిత పదార్థాల రవాణాపై దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. పెండింగ్ అపరాధ రుసుములు వసూలు చేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఏపీడీ సన్యాసిరావు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని వెలుగు ఏపీడీ సన్యాసిరావు అన్నారు. స్థానిక ఏఎంఎస్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి కన్వర్జెన్సీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడిలో అంతర్ పంటలు వేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్ర స్థాయిలో పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగ ప్రాజెక్టు మేనేజర్ షన్ముఖరాజ్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు ప్రోత్సాహించాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మన్మధరావు, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్తాం..



మల్లమ్మగూడ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలస పంచాయతీ మల్లమ్మగూడ గిరిజనులకు పక్కా గృహాల నిర్మాణానికి రిజర్వ్ ఫారెస్టు నిబంధనలు అడ్డంకిగా మారాయి. మల్లమ్మగూడలో దాదాపు 20 ఏళ్లుగా నివాసముంటున్న 12 మంది గిరిజన కుటుంబాలకు ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో గిరిజనులు వారు దీర్ఘకాలంగా నివసిస్తున్న ప్రాంతంలో నిర్మాణాలకు అవకాశం కల్పించాలని అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేకాధిరి, జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ శివ్వాల మన్మధరావుతో పాటు ఎంపీడీఓ విజయరంగారావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరావు తదితరులు మల్లమ్మ గూడా పరిసరాలను పరిశీలించారు. ఈ ప్రాంతం రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉన్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని, ఉన్నతాధికారుల సూచనలతో తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి తెలిపారు.

● డేంజర్ జోన్స్



పాలకొండ - వీరఘట్టం రహదారిలో దెబ్బతిన్న రహదారి



మండలంలో తంపటాపల్లి - తుమరాడ గ్రామాల మధ్య భారీ మలుపు



పాలకొండ - పార్వతీపురం వయా రాయిఘడ రహదారిలో అంతర్రాష్ట్ర రహదారిలో ప్రమాదకర అట్టలి మలుపు

వేగ నిరోధకాలు ఉండవు.... హెచ్చరిక బోర్డులు కానరావు... పాలకొండ ప్రాంతంలో అంతర్రాష్ట్ర రహదారిలో 20 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారికి అనుసంధానం చేసే అనేక గ్రామీణ కూడళ్లు... నిత్యం ఈ రహదారిలో పాలకొండ మొదలు వీరఘట్టం వరకూ ఎక్కడో ఓ దగ్గర రహదారి ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ప్రమాదం సంభవించింది అంటే చాలు కచ్చితంగా చావు కబురు వినాల్సిందే అన్నట్లుగా తయారైంది పరిస్థితి. ముఖ్యంగా ఈ రోడ్డులో ఎక్కడికక్కడే పెద్దెత్తున గోతులు, రాళ్లు తేలి రహదారి పూర్తిగా దెబ్బతింది. పలు చోట్ల భారీ మలుపుల వద్ద కూడా ఇదే పరిస్థితి. రాజుపేట, తుమరాడ, అట్టలి, బెజ్జి, నవగాం కూడలితో పాటు వీరఘట్టం మండల పరిధిలో వండవ, తూడి, చిదిమి కూడళ్లలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

– పాలకొండ రూరల్